

వరదలెక్కలపై గందరగోళం



కడెం ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం (ఫైల్)


- ప్రాజెక్టుల్లోకి వచ్చే వరద ప్రవాహంపై అయోమయం
- ప్రతీఏటా వర్షాకాలంలో అధికారులకు ప్రాణ సంకటం
- వరద ఉధృతిని నిర్ధారించలేకపోతున్న అధికారులు
- గేజింగ్ స్టేషన్లు, సెన్సార్లు లేకపోవడమే అసలు సమస్యలు

నిర్మల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని పలు సాగునీటి ప్రాజెక్టులకు ప్రతీఏటా వర్షాకాలంలో వచ్చే వరదనీటి ప్రవాహపు లెక్కలు గతితప్పుతున్నాయని అంటున్నారు. ఎగువప్రాంతం నుంచి ఎంత మేరకు దిగువన గల ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి వరదనీరు వస్తుందనే విషయంపై స్పష్టత కరువవుతున్న కారణంగా ఆఫీసర్లు ప్రవాహ తీవ్రత తోనే లెక్క కట్టాల్సి వస్తోందని అంటున్నారు. గత ఏడాది వర్షాకాలంలో వరదల కారణంగా జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు వచ్చిన వరద ప్రవాహపు లెక్కలు ఇరిగేషన్‌శాఖలో చర్చనీయాంశమవుతున్నాయి. కడెం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చిన వరదనీటి ప్రవాహపు లెక్కలు తలో రకంగా ఉన్నాయంటున్నారు. సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) ఓ రకంగా స్థానిక ఇరిగేషన్ అధికారులు మరోరకంగా వరద ప్రవాహపు లెక్కలు చెబుతుండడంతో గందరగోళం నెలకొంటుందని అంటున్నారు. అలాగే స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టుల పరిస్థితి కూడా ఇదే రకంగా మారిందని అంటున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల్లో ఇటీవల భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున ఎగువ నుంచి వరద నీరు ప్రవహించింది. అయితే ఈ ప్రాజెక్టుల్లోకి వచ్చిన వరద ప్రవాహపు నీటిలెక్కలపై కూడా స్పష్టత కొరవడిందంటున్నారు. భారీ వర్షాల సమయంలో సంబంధిత ఇంజనీర్లు ప్రాజెక్టుల వద్దనే ఉండి వరద ఉధృతిని ఊహించుకొని దిగువకు నీరును విడుదల చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. ముఖ్యంగా ఈ ప్రాజెక్టుల ఎగువ భాగాన రెయిన్ గేజ్‌స్టేషన్లు గాని సెన్సార్లు గాని లేకపోవడమే ఈ సమస్యకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. అయితే కడెం ప్రాజెక్టు ఎగువ బాగాన మాత్రం రెయిన్ గేజ్ స్టేషన్లు ఉన్నప్పటికీ ఈ స్టేషన్లను కడెం ప్రాజెక్టుకు అనుసంధానం చేయకపోవడంతో కురిసిన వర్షం లెక్కలకు అనుగుణంగా ఎంత మేర వరద ప్రాజెక్టులోకి వస్తుందోననే సమాచారం తెలుసుకోవడం కష్టంగా మారుతుందని అంటున్నారు. గత ఏడాది వరద సమయంలో ప్రాజెక్టులోకి ఆరు లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని ఇరిగేషన్ అధికారులు స్పష్టం చేస్తుండగా సెంట్రల్ వాటర్ కమిషనర్ మాత్రం నాలుగు లక్షల 94 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చిందని చెబుతుండడంతో నీటి లెక్కలపై స్పష్టత కరువవుతోందంటున్నారు. ముఖ్యంగా ప్రాజెక్టు రిజర్వాయర్‌లలో పెద్ద ఎత్తున పూడిక చేరుకోవడంతో నిల్వసామర్థ్యం క్రమంగా తగ్గిపోతుందని అంటున్నారు. అయితే ఈ ప్రాజెక్టులో ఎంత మేర పూడిక చేరుకుందోననే అంశంపై ఇప్పటికీ స్పష్టత లేదంటున్నారు. దీని కారణంగానే ఒక్కో ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం, కనిష్ట నీటి మట్టాల మధ్య పూడిక కారణంగా తేడా వస్తుందంటున్నారు. ఈ తేడానే అసలు సమస్యకు కారణమవుతుందంటున్నారు. ఎగువ నుంచి వరదను లెక్కలోకి తీసుకోకుండా దిగువకు రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతుండడమే కాకుండా రిజర్వాయర్‌లలోని విలువైన నీరు కూడా వృధాగా గోదావరి పాలవుతోందంటున్నారు. పూడిక కారణంగా నీటిమట్టాల లెక్కలు సక్రమంగా తెలియక కాలువలకు నీటి విడుదల విషయంలో కూడా సమతుల్యత లోపిస్తుందన్న వాదనలున్నాయి. ఎగువ నుంచి ఒకేసారి వరద ప్రవాహం ఎంత మేరకు వస్తుందో తెలియక ఒకేసారి ప్రాజెక్టుల గేట్లు ఎత్తి వేయడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్న సంఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. గతంలో నిర్మల్ పట్టణంలోని జీఎన్ఆర్ కాలనీ కూడా ఇలాగే నీట మునిగిన సంగతి తెలిసిందే. స్వర్ణప్రాజెక్టుకు వరద పోటు తీవ్రమవడంతో ప్రవాహ ఉధృతి తెలియక ఒక్కసారి ఆ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేశారు. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అలాగే కడెం, గడ్డెన్నవాగు ప్రాజెక్టులో కూడా ఇలాగే వరద ప్రవాహం పెరగడంతో ఒకేసారి గేట్ల నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో దాదాపు 5 కోట్ల రూపాయల విలువైన విద్యుత్ స్తంభాలు, టవర్లు నేలమట్టమయ్యాయి.

గేజింగ్ స్టేషన్‌లతో లింకేజీ లోపం..

స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టుల ఎగువ భాగాన రెయిన్ గేజింట్ స్టేషన్లు లేకపోవడంతో వరద ఉధృతి తెలియడం లేదంటున్నారు. దీంతో రెండు ప్రాజెక్టు రిజర్వాయర్‌లోకి ఎంత మేరకు వరద వస్తుందోనని విషయం తెలుసుకునేందుకు ఇంజనీరింగ్ అధికారులు నానా తంటాలు పడుతున్నారు. వరద తీవ్రతను తెలుసుకోవడంలో ఆలస్యం జరిగితే లోతట్టు ప్రాంతాలకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతున్న సందర్భాలు కూడా ఉన్నాయి. దీంతోపాటు కడెం ప్రాజెక్టుకు సంబంధించి ఎగువ భాగాన గేజింట్ స్టేషన్లు ఉన్నప్పటికీ ఆ గేజింట్‌స్టేషన్‌లతో ఈ ప్రాజెక్టుకు అనుసంధానం లేకపోవడం సమస్యకు కారణమవుతోంది. ఎగువన గేజింట్ స్టేషన్లు ఉండడంతో వర్షపాతంతో పాటు వరద ఉధృతిని కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఇక్కడి ప్రాజెక్టుకు గేజింట్ స్టేషన్లతో అనుసంధానం లేని కారణంగా వరద ఉధృతిని తెలుసుకోవడం కష్టంగా మారింది. ఇందులో భాగంగానే గత వరదల సమయంలో నీటి ప్రవాహ ఉధృతిని తెలుసుకోవడం అధికారులకు ఇబ్బందికరమైంది. అర్ధరాత్రి వరకు కడెం ప్రాజెక్టులోకి వరద ఎంత మేరకు వస్తుందోననే విషయం తెలియక అటు అధికారులు ఇటు లోతట్టు ప్రాంతాల ప్రజలంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇప్పటికైనా ఎగువ గల గేజింట్ స్టేషన్‌లను కడెం ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని అలాగే స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టులపై సెన్సార్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కడెం ప్రాజెక్టు ఇదే..



67 టీఎంసీల కడెం వరద నీరు గోదావరి పాలు..

వరుసగా గత రెండు సంవత్సరాల నుంచి వర్షాకాలంలో కడెం ప్రాజెక్టులోకి ప్రవహించిన వరద నీరంతా భారీగా గోదావరి పాలైంది. ప్రాజెక్టులోకి మొత్తం 72 టీఎంసీలకు పైగా వరద నీరు ప్రవహించినట్లు అధికారులు అప్పట్లో చెప్పారు. కాగా 67 టీఎంసీలకు పైగా నీరును గోదావరిలోకి వదిలి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కడెం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 7.27 టీఎంసీలు కాగా దీనికి పదింతల నీరంతా గోదావరి పాలైంది. అలాగే స్వర్ణ, గడ్డెన్నవాగు ప్రాజెక్టులకు వచ్చిన వరద నీరు కూడా వేల క్యూసెక్కులలో దిగువకు వృధాగా విడుదల చేశారు. ప్రతీ ఏటా ఇలా వరదనీరు భారీగా గోదావరి పాలవుతున్నప్పటికీ గత వర్షాకాలంలో పదింతలు ఎక్కువగా నీరును గోదావరిలోకి వదిలిపెట్టారు. అయితే ఈ లెక్కలపై కూడా ఇప్పటికీ స్పష్టత లేదని అధికారులు పేర్కొంటున్నారు.

కదిలిలో శ్రావణ సోమవారం పూజలు



పాపహరేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు

దిలావర్‌పూర్, ఆగస్టు 12 : శ్రీ మాతాన్నపూర్ణ కదిలి పాపహరేశ్వరస్వామి దర్శన భాగ్యం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రావణమాసం రెండో సోమవారం కావడంతో తెల్లవారు జాము నుంచే భక్తుల రాక మొదలైంది. గోముఖ గుండంలో పవిత్రస్నానాలు ఆచరించిన భక్తులు పాపహరేశ్వరస్వామి దర్శనం కోసం బారులు తీరారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కదిలి వచ్చిన భక్తులకు కుంటాల మండలం కల్లూర్ గ్రామానికి చెందిన హరిణి, శ్రీధర్ దంపతులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ ఎన్.వెంకట్‌రావు, మారుతి పటేల్, రవి, తదితరులు పాల్గొన్నారు.

'నా భర్తను కాపాడండి' ఇమిగ్రేషన్ అధికారులకు వినతి



ఇమ్మిగ్రేషన్ కార్యాలయం ముందు బాధిత కుటుంబ సభ్యులు

ముథోల్, ఆగస్టు 12 : కువైట్ దేశంలో చిక్కుకున్న జిల్లా ముథోల్ మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నాందేవ్‌ను స్వదేశానికి తిరిగి తెచ్చే విధంగా తక్షణమే చర్యలు చేపట్టాలని, పాస్‌పోర్ట్, ఇమ్మిగ్రేషన్ అధికారి అమిత్ కుమార్‌ను హైదరాబాద్‌లో బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, టీఎస్ఎండీసీ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ ఆధ్వర్యంలో సోమవారం బాధితుడు కుటుంబ సభ్యులు కలిశారు. క్లీనింగ్ అని చెప్పి ఏజెంట్ మాయ మాటలు చెప్పి కువైట్ దేశానికి పంపించడంతో అక్కడ ఎడారిలో ఒంటెలు మేపుతూ నా భర్త ఇబ్బందుల పాలవుతున్నాడని ఆమె వాపోయారు. తక్షణం స్పందించి నాందేవ్‌ను స్వదేశానికి తేవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి, తెలంగాణ జన సమితి ముథోల్ నియోజకవర్గ ఇంచార్జి సర్దార్ వినోద్ కుమార్, నాందేవ్ భార్య రాథోడ్ లక్ష్మీ, కుమారుడు శ్రీకాంత్, నాయకులు నరహరి గౌడ్, నరేందర్, రంజిత్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ బాక్సర్ అశ్వినికి ఎస్పీ అభినందన



అశ్వినిని అభినందిస్తున్న ఎస్పీ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 12 : ఇటీవల తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన 8వ తరగతి విద్యార్థి బత్తుల అశ్వినిని ఎస్పీ జానకి షర్మిల అభినందించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అశ్విని అభినందిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. 30-40 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. అశ్విని తల్లి బత్తుల లక్ష్మీ హోంగార్డు అధికారిగా జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 30న ఢిల్లీలో నిర్వహించే జాతీయ బాక్సింగ్ పోటీల్లో అశ్విని పాల్గొననుంది.

ఇథనాల్‌పై కొనసాగుతున్న నిరసన



దిలావర్‌పూర్‌లో నిరసన శిబిరం

దిలావర్‌పూర్, ఆగస్టు 12 : మండలంలో ఇథనాల్ వ్యతిరేక నిరసన కొనసాగుతోంది. సోమవారం నాటికి 20వ రోజుకు చేరుకుంది. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారుల స్పందన లేకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో గ్రామస్థులు సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. ముందు ముందు ఏం చెద్దాం అనే విషయంపై చర్చించడం, తగిన నిర్ణయాలు తీసుకునేందుకు గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేస్తామని ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు తెలిపారు. ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు.

తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యకు డిమాండ్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 12 : మున్సిపల్ శాఖలో ఆర్‌టీఐ యాక్ట్ ప్రకారం సమాచారం కోరగా అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారని వారిపై చర్య తీసుకోవాలని సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కమిటీ అధ్యక్షుడు సయ్యద్ హైదర్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. సారంగాపూర్ మండలం చించోలి(బి) సమీపంలో ఈద్గా నిర్మాణానికి సంబంధించిన అన్ని వివరాలు కోరగా అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. సభ్యులు మొహమ్మద్ సాబీర్, అబ్దుల్ సాదిక్, ఎండీ అజహర్, అబ్దుల్ రఫీ పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 12 : నిషేధిత గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను సోమారం అరెస్ట్ చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఎస్సై రమేష్ వివరాలు వెల్లడించారు. ఎస్పీ జానకిషర్మిలకు అందిన సమాచారం మేరకు ఆదివారం పట్టణ ఎస్సై రమేష్ సిబ్బందితో కలిసి వ్యవసాయ మార్కెట్ కార్యాలయం వద్ద సయ్యద్ అనే అరటి పండ్ల వ్యాపారి ఓ ప్లాస్టిక్ కవర్‌లో 450 గ్రాముల గంజాయి తీసుకుని అమ్మేందుకు వెళ్తుండగా పట్టుకుని విచారించారు. అతను అబ్దుల్ ముక్తార్ అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసి కస్టమర్లకు అమ్ముతున్నానని తెలిపాడన్నారు. బస్టాండ్ వెనుకవైపు ఉన్న ముకర్తర్‌ను పట్టుకున్నామని అతని వద్ద ఉన్న 1100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ముక్తార్‌ను విచారించగా మహారాష్ట్రలో గుర్తు తెలియని వ్యక్తి నుండి గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపాడన్నారు. అతని వద్ద 1.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని ఇద్దరినీ సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

గంజాయికి యువత బానిసలు కావొద్దు : డీఎస్పీ

మత్తు పదార్థాలకు అలవాటు పడి యువత బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని డీఎస్పీ గంగారెడ్డి సూచించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతై... గంజాయి అమ్ముతున్న ఇద్దరినీ అరెస్ట్ చేసి సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై రమేష్, సిబ్బందిని అభినందించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డవారు సమీపంలో ఉంటే పోలీసుస్టేషన్‌లో గాని 100 నెంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు.

వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు అపహరణ

నర్సాపూర్(జి), ఆగస్టు12 : ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించిన ఘటన మండలంలోని తురాటి గ్రామ కూడలి పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. తురాటి గ్రామానికి చెందిన గడ్డం లింగవ్వ అనే వృద్ధురాలు జిల్లా కేంద్రం నుంచి ఉదయం ఆరు గంటలకు బస్సులో బయలు దేరి తురాటి బస్‌స్టాపు వద్ద దిగింది. ఒంటరిగా దారి వెంట నడుచుకుంటూ ఇంటికి వెళుతుంది. వృద్ధ మహిళ మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఇద్దరు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలి పారు. తర్వాత తేరుకున్న వృద్ధురాలు సమాచారాన్ని ఆమె కుటుంబసభ్యులకు అందించింది. వృద్ధురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రజల అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 12 : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, భూ సమస్యల వంటి అంశాలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయని సంబంధిత శాఖల అధికారులు దరఖాస్తులను పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. అలాగే ఈ నెల 5 నుండి 9 వరకు నిర్వహించిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో అధికారులందరూ సమన్వయంతో పని చేశారని ఇదే స్ఫూర్తితో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. నెలలో ప్రతి మొదటి మూడవ శనివారాలు శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా కేటాయించిన ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నష ముక్త్ భారత్ కార్యక్రమం నాలుగవ సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మాదక ద్రవ్యాల రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని తెలిపారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలను అరికట్టేందుకు గాను అధికారులచే కలెక్టర్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్‌వో భుజంగ్‌రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ వైర్ దొంగను పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నవీన్ కుమార్, ఎస్సై సుమలత

లక్ష్మణచాంద, ఆగస్టు 12 : వ్యవసాయ బోరు మోటార్ సర్వీస్ వైర్ దొంగతనం చేస్తున్న నిందితుడిని లక్ష్మణచాంద పోలీసులు పట్టుకున్నట్లు సీఐ నవీన్ కుమార్ సోమవారం వివరాలు వెల్లడించారు. సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సుమలత తెలిపిన వివరాల ప్రకారం... చామన్‌పెల్లి గ్రామానికి చెందిన లోకిని వరుణ్ అనే వ్యక్తి మద్యం తాగుటకు, జల్సాలు చేయుటకు అలవాటు పడి దొంగతనాలు చేసి సులభంగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. మాచాపూర్ గ్రామ శివారులో గల గోదావరి ఒడ్డున ఉండే బోరు మోటార్ యొక్క స్టార్టర్‌ను కరెంటు స్తంభంకు బిగించే సర్వీస్ వైర్ దొంగతనం చేస్తూ దానిని అమ్మటం ద్వారా సులభంగా డబ్బులు సంపాదించే మార్గంను ఎంచుకున్నాడు. పథకం ప్రకారం శనివారం రోజున రాత్రి సమయంలో మాచాపూర్ గ్రామ శివారులోని గోదావరి ఒడ్డుకు వెళ్లి అక్కడ ఎవరూ లేనిది గమనించి బోర్ మోటార్ స్టార్టర్ నుండి కరెంటు స్తంభాలకు బిగించే సర్వీస్ వైర్‌ను స్టార్టర్ నుండి ఒక స్క్రూ డ్రైవర్‌తో తీసి తరువాత ఒక కత్తితో తెంపి వైర్‌ను దొంగిలించాడు. అనంతరం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా వద్ద ఉన్న ప్లాస్టిక్, చెత్త డబ్బాలను కొనుగోలు చేసే షాప్‌లో అమ్మేశాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు చాకచక్యంగా నిందితుడిని పట్టుకుని అతడి నుండి ఒక స్క్రూ డ్రైవర్, ఒక కత్తి, సర్వీస్ వైర్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవటంలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన ఎస్సై సుమలత, సిబ్బందిని సీఐ నవీన్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

దివ్యాంగులకు బస్సు పాసుల పంపిణీ

దస్తురాబాద్ రూరల్, ఆగస్టు 12 : నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగులకు ప్రయాణంలో 50 శాతం రాయితీతో కూడిన బస్సు పాసులను మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ బస్సు పాసులు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులలో ఈ కార్డు చూయించి బస్సులో హాఫ్ టికెట్ తీసుకోవచ్చని తెలిపారు. ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం, సుఖవంతం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది టీవీ రమణ, రాష్ట్ర దివ్యాంగుల ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కడెం, పాండ్వాపూర్, మద్దిపడగ, దస్తురాబాద్, ఆకొండపేట్, బెల్లాల్, లింగాపూర్ దివ్యాంగులు పాల్గొన్నారు.

విద్యుత్ పంపిణీ వ్యవస్థ మెరుగుపరిచాం : ఎస్ఈ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 12 : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం పంపిణీ వ్యవస్థ మెరుగుపరిచామని ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఎనిమిది నెలలుగా వివిధ సామర్థ్యం గల 8(63) కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేశామన్నారు. తద్వారా అధిక లోడ్ భారం తగ్గిందన్నారు. వదులుగా ఉన్న లైన్లు ఉన్న చోట 624, మిడ్ పోల్స్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 663 కొత్త పోల్స్ వేశామని తెలిపారు. ఎత్తు తక్కువగా ఉన్న 12 ట్రాన్స్‌ఫార్మర్ల గద్దెలు ఎత్తు పెంచామని తద్వారా పశువులు ప్రమాదాల బారిన పడకుండా ఉంటాయన్నారు. పాత లైన్లు మార్చి 8.8 కిలో మీటర్ల కొత్త లైన్లు వేశామన్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచినట్లు వివరించారు. 17 ఏబీ స్విచ్‌లు పెట్టామని, నెట్వర్క్ వ్యవస్థ మరింత బలోపేతం చేసినట్లు స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు.

సంక్షిప్త సమాచారం

జిల్లాలో వర్షపాతం

నిర్మల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 2.6 మిల్లీమీటర్లు కాగా, జిల్లాలో అత్యధికంగా ఖానాపూర్ మండలంలో 21.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కడెం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 7.603 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 7.164 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుంచి 3,965 క్యూసెక్కుల వరద నీరు రాగా ఒక వరగ దేటు ఎత్తి దిగువనున్న గోదావరిలోకి 4,950 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు.

విద్యా వలంటీర్లను నియమించాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 12 : జిల్లాలో విద్యావలంటీర్లను నియమించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నారాయణ పేట, వికారాబాద్‌లకు నియమించినట్లుగానే అవసరమైన అన్ని జిల్లాల్లో నియమించాలన్నారు. వీవీలకు పారితోషకం 15,600లు చెల్లించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల్లో భాగంగా సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏ, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 ద్వారా జీతాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పీఆర్సీ నివేదిక సమర్పించండి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 12 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల, పెన్షనర్లకు వెంటనే పీఆర్సీ నివేదిక సమర్పించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై. సాయన్న, హరిప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. గురుకులాలు, మాడల్‌స్కూళ్లలో పనిచేస్తున్న వారికి 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లింపు సమస్య పరిష్కరించాలన్నారు.

ఉద్యోగులకు సన్మానం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 12: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నుంచి బదిలీపై వెళ్తున్న 8 మంది సిబ్బందికి సోమవారం సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ఈశ్వరి దేవి, ఎం.లలిత, ఇఫ్తాకర్ అలం, శ్రీనివాస్, జి.నాగరాణి, ఎం.లక్ష్మీబాయి, కె.యశోద, కల్యాణ్, గంగామణిను పుష్పగుచ్చాలు అందించి శాలువాలతో సన్మానించారు.

సాయినగర్ సమస్యలపై 'ప్రజావాణి'లో వినతి

బోథ్, ఆగస్టు 12 : మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను బోథ్ మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకులు జక్కుల వెంకటేష్ సోమవారం ప్రజావాణిలో విన్నవించారు. సాయినగర్‌లో మురికి కాలువలు సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని కోరడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అధికారులు ఈ విషయంలో తగు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

● జామ్ని హెచ్ఎం శరత్‌కుమార్‌యాదవ్

జైనథ్, ఆగస్టు 12: జైనథ్ మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో గల విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఆధారపడి ఉందని జామ్ని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శరత్‌కుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం జైనథ్ మండలంలోని గిరిజన గ్రామమైన జామ్ని ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాలల్లో బదిలీ పై వెళ్లిన తొమ్మిది మంది ఉపాధ్యాయులను పూల మాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెందూరుదేవన్నలు మాట్లాడుతూ గత 9 సంవత్సరాలుగా గిరిజనుల విద్యార్థుల విద్యా అభివృద్ధికి చేసిన సేవలను వివరించారు. దీంతో పాటు బదిలీ పై వచ్చిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నైతందేవుబాయి, ఐటీడీఏ డైరెక్టర్ కుర్సంగేతానాజి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

సిరికొండ, ఆగస్టు 12: గత ఏడాది భారీ వర్షాలతో సిరికొండ మండల కేంద్రం నుంచి జెండాగూడ గ్రామానికి వెళ్ళే దారిపై పెద్ద పెద్ద గుంతల ఏర్పడి బురదమయంగా మారింది. దారిపై నడవలేక, అత్య వసర సమయంలో ఆసుపత్రికి సరైన సమయంలో చేరుకోలేక ఆదివాసీలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. సోమవారం నిర్వహించిన గిరిజనదర్బార్‌లో ఇదే విషయమై ఐటీడీ ఏపీవో ఖుష్బూగుప్తాను కలిసి జెండాగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనులు వినతాపత్రాన్ని అందజేశారు. ఎన్నోఏళ్ళుగా తమ గ్రామానికి రోడ్డు, రవాణా సౌకర్యం లేకపోవడంతో కాలినడకనే మండల కేంద్రానికి చేరుకోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకెళ్ళారు. ఇకనైనా తమ గ్రామాన్ని సందర్శించి, తమ గ్రామానికి రోడ్డు సౌకర్యంతోపాటు మౌలికవసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామపటేల్ తొడసం అమృత్‌రావ్, మడావి చిత్రు, గెడం రాజు, కుమ్రం గంగారాం, చిక్రం జుగాధిరావ్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ


బోథ్, ఆగస్టు 12: మండల కేంద్రానికి చెందిన సిరిపురం నవీన్ వెన్నుపూస సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. అయితే ఆయన చికిత్స నిమిత్తం 10 లక్షల రూపాయలు అవసరమయ్యాయి. ఈ విషయాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ దృష్టికి తీసుకురావడంతో ఐదులక్షల ఎల్‌వోసీ మంజూరీ చేయించారు. అందుకు సంబంధించిన చెక్కును బోథ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి పి.చంటికి సోమ వారం అందివ్వడం జరిగింది. చెక్కు అందించిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబం తరఫున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం

● ఏఐఎస్ఎఫ్ నాయకులు

బోథ్, ఆగస్టు 12 : విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేసింది కేవలం ఏఐఎస్ఎఫ్‌యేనని మండల పార్టీ కన్వీనర్ మున్షిఫ్ పేర్కొన్నారు. సోమవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అమరులైన ఆజాద్, భగత్‌సింగ్, రాజ్ గురుల చిత్రపటాలకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరత మాత బానిస సంకెళ్ళ నుంచి విముక్తి కావాలని పిడికిలెత్తి నినదించారన్నారు. 18 సంవత్సరాల యువకులకు ఓటు హక్కు గురించి పోరాటం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నరేష్, అమీర్, విక్ర మ్ తదితరులు ఉన్నారు.















బోథ్ బస్టాండ్‌ను సందర్శించిన డిపో మేనేజర్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు

బోథ్, ఆగస్టు 12: నిర్మల్ డిపో మేనేజర్ సోమవారం బోథ్ బస్టాండ్‌ను సందర్శించారు. బోథ్ మండలం మీదుగా మహారాష్ట్రలో కిన్వాట్ వరకు నడిపిస్తున్న అంతర్రాష్ట్ర రహదారిని రద్దు చేయడంపై ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన నిర్మల్ డిపో మేనేజర్ సోమవారం బోథ్ బస్టాండ్‌ను సందర్శించి స్థానికంగా ఉన్న సమస్యలను కంట్రోలర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక బస్సులు రాకపోవడం వల్ల కలిగే ఇబ్బందిని ప్రయాణీకులను అడిగి తెలుసుకోవడం జరిగింది. రద్దు చేసిన బస్సు నడిపించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. కాగా అక్కడే ఉన్న మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు అనిల్ నిర్మల్ నుంచి సోనాల వరకు నడుపుతున్న హైదరాబాద్ బస్సును తిరుగు ప్రయాణంలో సోనాల వరకు నడిపించాలని డిపో మేనేజర్‌ను కోరారు. ఇందుకు సంబంధించిన వినతిపత్రాన్ని స్థానికులు కలిసి మేనేజర్‌కు అందించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో ధర్నా

ఉట్నూర్, ఆగస్టు 12: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసులరామ్మూర్తి, జాతీయ ప్రధాన కార్యదర్శి దాసండ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద ఎస్సీల వర్గీకరణకు వ్యతిరేకంగా సోమవారం మహాధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మాల మహానాడ్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి డా.దాసండ్లప్రభాకర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పును విరమించుకునే వరకు ఉద్యమిస్తామన్నారు. రాజ్యాంగంలో ఉన్న ఆర్టికల్ 341ను సవరించకుండా వర్గీకరణ ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. వర్గీకరణ విరమించుకునే వరకు మాలమహానాడు, మాల ఉపకులాల సంఘాలు తీవ్ర స్థాయిలో దేశవ్యాప్తంగా ఉద్యమిస్తాయని తెలి పారు. కార్యక్రమంలో మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జుపాకసుధీర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆరే.దేవకర్ణ, మహిళ రాష్ట్ర కార్యదర్శి గంట బబిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీ తెలంగాణ భవన్‌లో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి వినతిపత్రం సమర్పించారు.

సమ్మెతో మూతబడిన జీసీసీ పెట్రోల్‌బంక్‌లు

● చర్చలు జరుపుతున్న అధికారులు



మూతబడిన జీసీసీ పెట్రోల్‌బంక్

ఉట్నూర్, ఆగస్టు 12: గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ల్లో పనిచేస్తున్న గిరిజన దినసరి ఉద్యోగులు వేతనాలు పెంచాలంటూ సమ్మెకు దిగారు. ఐదురోజులుగా సమ్మెలోకి వెళ్లడంతో గిరిజన సహకార సంస్థ బంకులు మూతబడ్డాయి. ఉమ్మడి జిల్లా లో జీసీసీ ఆధ్వర్యంలో ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, జైనూర్, ఇచ్చోడ, సిరికొండ, కెరమెరి, తిర్యాణి, కాగజ్‌నగర్, నిర్మల్‌లలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంకుల్లో స్థానిక గిరిజనులకే ఉద్యోగఅవకాశాలు ఇవ్వడానికి ఐటీ డీఏప్రాజెక్టు అధికారి సూచన మేరకు 71మంది గిరిజన నిరుద్యోగులను దినసరి ఉద్యోగులుగా నియమించారు. గత మూడేళ్లగా పైగా పనిచేస్తున్న జీసీసీ బంకుల్లో ఉద్యోగులకు నెలకు రూ.8500 ఒక్కొక్కరికి చెల్లిస్తున్నారు. ఈ వేతనం తమకు సరిపోదంటూ కార్మికులు మెరుపు సమ్మెకు దిగడంతో జీసీసీ ఈఎం రామనాథం ఉద్యోగులను సముదాయించారు. అయిన లాభం లేకపోవడంతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయానికి సోమవారం చేరుకున్న దినసరి ఉద్యోగులతో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కలిసి వేత నాలు పెంచాలని కోరారు. మిగతా ఐటీడీఏల పరిధిలో ఉన్న జీసీసీ పెట్రో ల్‌బంకుల్లో ఎవరికి ఎంత వేతనాలు ఇస్తున్నారో తెలుసుకుని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి ఈ నెలాఖరులోగా జీసీసీ బంకుల్లో పనిచేస్తున్న దినసరి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని, మంగళవారం నుంచి అందరు విధుల్లో చేరాలని పీఓ ఖుష్బుగుప్తా కోరారు.

ఝరిపున్నగూడ ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

తలమడుగు, ఆగస్టు 12: వసతిగృహాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'ఆంధ్రజ్యోతి' బృందం విజిట్ చేసి కథనాలు రూపొందించింది. విద్యార్థుల సమస్యలు ఆంధ్యజ్యోతి దినపత్రికలో ప్రచురణ కావడంతో ఇందులో భాగంగా ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల గూడ ఆశ్రమ బాలుర పాఠశాలలో విద్యార్థుల సమస్యలను వెలికితీయడంతో అధికారులు స్పందించారు. అధికారులు, వైద్యసిబ్బంది ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి చర్మవ్యాధ్యులు సోకిన విద్యార్థులు, ఇతర విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు హాస్టల్ వార్డెన్ ప్రేమ్‌కుమార్ వైద్యసిబ్బందికి తెలిపారు. విద్యార్థులకు వ్యాధులు తగ్గే వరకు వైద్యపరీక్షలు చేపడుతామన్నారు. అదే విధంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని హాస్టల్ వార్డెన్ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది.

ఉద్యోగ భద్రత కల్పించండి

● సమగ్ర శిక్ష సిబ్బంది నిరసన

నార్నూర్, ఆగస్టు 12 : గాదిగూడ మండల విద్యాకార్యాలయం వద్ద సోమవారం సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఉద్యోగులు మాట్లా డుతూ ఉద్యోగ భద్రత లేనందున తక్కువ వేతనాలతో పాటు పనితీవ్రత పెరగడం పెరిగిన నిత్యావసర ధరలకు కుటుంబ పోష ణ భారాన్ని మోయలేక నిరాశ నిస్పృహలకు లోనై గుండెపోటు ఇతరాత్ర వ్యాధుల వలన ప్రతి నెలకు ఇద్దరు చొప్పున కొన్ని వందల మంది మరణించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమానికి సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు వినోద్‌జాదవ్, ప్రధాన కార్యదర్శి జిశైలజ, నార్నూర్, గాదిగూడ సిబ్బంది ఉన్నారు.

ఉట్నూర్ : తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సమగ్ర శిక్షలో విధులు నిర్వర్తిస్తూ చనిపోయిన ఉద్యోగులకు ఉట్నూర్ మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు టైంస్కేల్ ప్రకటించి ఉద్యోగ భద్రత అందించాలని అదే విధంగా జీవిత భీమా రూ.5లక్షల హెల్త్‌కార్డు, ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు 250 మంది ఉద్యోగులు తెలంగాణ రాష్ట్రంలో మరణించారని వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు ధరమ్‌సింగ్, నాయ కులు ప్రవీణ్, భీర్షావ్, ఇంద్రు అర్జున్‌లు పాల్గొన్నారు.

నేరడిగొండ : కేజీబీవీలో పని చేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిం చాలని కేజీబీవీ ప్రిన్సిపల్ రజిత అన్నారు. సోమవారం కేజీబీవీ పాఠశాల, కళాశాలలో మధ్యాహ్నభోజన విరామ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కేజీబీవీల్లో విధి నిర్వహణలో మరణించిన మహిళా ఉద్యోగులకు నివాళులర్పించారు. సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకపోవడంతో చాలీ చాలని వేతనాలు, మానసిక ఒత్తిడితో కుటుంబాలు రోడ్డు పడుతున్నాయని అన్నారు. వెంటనే ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయడంతో పాటు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. అప్పటి వరకు మినిమం టైమ్‌స్కేల్‌ను వర్తింప చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, పీజీ సీఆర్పీలు, బోధనేతర సిబ్బంది తదితర పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

బోథ్ : మండలకేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో సోమవారం సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన ఉద్యోగులకు సర్వశిక్ష అభియాన్ సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిభారంతో సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఇరువురు ఉద్యోగులు గుండెపోటుకు గురై మృతి చెందారని వారి కుటుంబాలకు ఉద్యోగం కల్పించాలన్నారు.

తాంసి : తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తాంసిలో అమరులైన ఉద్యోగులకు నివాళులర్పించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

మొరం తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

● ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు

నార్నూర్, ఆగస్టు 12: ఆదిలాబాద్ ఏజెన్సీ గిరిజన ప్రాంత మండలాలు అయిన నార్నూర్ గాదిగూడలోని పలు గ్రామాల వద్ద రాత్రి పగలు జేసీబీ ట్రాక్టర్ వాహనాలతో ప్రభుత్వ భూమిలో గుట్టలు తవ్వి అక్రమ మొరం రవాణా జోరుగా సాగుతోంది. ఇలాంటి మొరం దందాపై అధికారులకి స్థానిక గిరిజన ఆదివాసులు సంఘాలు ఫిర్యాదులు చేసినా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతంబాలు డిమాండ్ చేశారు. సోమవారం సంఘ నాయకులతో కలిసి కుమ్రంభీంవిగ్రహానికి పూలమాల వేసి అనంతరం నార్నూర్ మండల కేంద్రం జిన్‌గూడ పరిసర ప్రాంత గుట్టలు సందర్శించి అక్కడ గత కొన్ని నెలల క్రితం నుంచి అక్రమ మొరం రవాణా జరుగుతుందన్నారు. గుట్టని సగానికి పైగా అక్రమదారులు తవ్వినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఏజెన్సీ చట్టాలు 1/70, 1/599 వాటికి విరుద్ధంగా రాత్రి వేళ అక్రమంగా ట్రాక్టర్ జేసీబీ వాహనాలతో ఇంత పెద్ద ఎత్తున్న మొరం తీసుకు వెళ్లినా అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోరా అని ప్రశ్నించారు. న్యాయ పోరాటానికి దిగవలసి వస్తుందని ఆయన పేర్కొన్నారు. సంబంధిత అంశాలపై రెవెన్యూ అధికారులతో చర్చించారు. డిప్యూటీ తహసీల్దార్ మొరం తవ్వకాలు జరిగే ప్రాంతంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదివాసీ సంఘం నాయకులకు అధికారులు హామీ ఇచ్చారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీని కలిసిన నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 12: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మనోహర్‌రావుని తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. నిరుపేద ఎస్సీలకు రుణాలు అందించి అభివృద్ధి పథంలో నడిపించాలని ఈడీని కోరగా తప్పకుండా తనవంతుగా కృషిచేస్తానని తెలిపారన్నారు. ఇందులో తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మల్యాల మనోజ్ మాదిగ, రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు నక్కరాందాస్ మాదిగ, బాబుజగ్జీవన్‌రావ్ అధ్యక్షులు మల్యాల స్వామి, జిల్లా కమిటీ నాయకులు జువాక నరసింహులు మాదిగ, కత్తి గంగాధర్‌మాదిగ, ముఖ్యర అశోక్‌మాదిగ, జెల్లమహేందర్ మాదిగ, చొప్పదండి భూమన్నమాదిగ, బట్టు మహేందర్‌మాదిగ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 12: ఎయిడ్స్ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎయిడ్స్, కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమ అధికారి డాక్టర్ ఎం.గజానన్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ యువజన ఉత్సవాన్ని పురస్కరించుకొని ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో కళాశాల విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, రక్తదానం, సుఖవ్యాధులు, టీబీ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆదిలాబాద్‌లో తిరంగా ర్యాలీ

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 12: బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎంపీ గొడం నగేష్ ప్రారంభించారు. విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టి నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అంతకుముదు ఎంపీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు.జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద, మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, నాయకులు విజయ్, జోగు రవి, ఆకుల ప్రవీణ్, పద్మ, దయాకర్ పాల్గొన్నారు.

నేరడిగొండ:మండల కేంద్రంలో తిరంగ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల కన్వీనర్ సాబ్లెసంతోష్‌సింగ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను ఈ నెల 15 వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మహనీయుల విగ్రహాలు, స్మారక చిహ్నాల చుట్టు పరిశుభ్రత కార్యక్రమాలు, సమ్మేళనాలు, సదస్సులు నిర్వహించి దేశ విభజ చీకటి అధ్యాయాన్ని స్మరించుకునే కార్యక్రమాలు చేపడతామన్నారు. అమరవీరుల స్మారకచిహ్నాలు, విగ్రహాల వద్ద పుష్పాంజలి ఘటిద్దామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గట్టునారాయణ, రాథోడ్‌కమల్‌సింగ్, ఏరు రాజేశ్వర్, కోటేశ్వర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించేందుకు ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ నితేష్ కోరారు. అజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా సోమవారం బీజేపీ మండల నాయకులతో కలిసి హర్‌ఘర్ తిరంగ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు అరెల్లి రాజలింగు,చ స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్‌సింగ్, షేకావత్, మెస్రం తుకారం, జైస్వాల్ శివకుమార్, కనక తుకారం, కోవా రాజేశ్వర్ పాల్గొన్నారు.

దాడులు ఆపాలని ర్యాలీ

ఇంద్రవెల్లి, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందూవులపై జరుగుతున్న దాడులను ఆపాలని బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ నితేష్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి నిరసన ర్యాలీ అంజి చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు అరెల్లి రాజలింగు, నాయకులు కనక తుకారం, ఆడావ్ చంపత్‌రావు, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపిక్‌సింగ్, షేకావత్ జైస్వాల్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ : బంగ్లాదేశ్ అల్లర్లలో హిందూవులు, వారి మందిరాలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ సభ్యులు మాట్లాడుతూ.. మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నందున విచారణ కమిటీ ఏర్పాటుచేసి బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గ్రామీణ రైతుకు ఎర్రకోట ఆహ్వానం

మామడ రూరల్, ఆగస్టు 12 : ఆగస్టు 15వ రోజున ఢిల్లీలోని ఎర్రకోటలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కొరిటికల్ గ్రామానికి చెందిన ఏలూరి హారిక దువ్వెందర్‌రెడ్డికి కేంద్ర ప్రభుత్వం నుండి ఆహ్వానం అందింది. నమో డ్రోన్ దీదీ కార్యక్రమంలో భాగంగా కోరమాండల్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ రైతు కుటుంబం రైతులకు డ్రోన్ స్ప్రే వాడే పద్ధతి, తక్కువ నీరు, తక్కువ మందు, ఎక్కువ లాభం అని రైతులకు అవగాహన కల్పించి వాడే పద్ధతిని తెలియజేసినందుకు కోరమాండల్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం వీరికి స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొని అవకాశం కల్పించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం రోజున ఢిల్లీకి రైతు కుటుంబం ప్రయాణమయ్యారు. వీరిని కోరమాండల్ సంస్థ, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

రోజువారీ లక్ష్యంతో పన్నుల వసూళ్లు

● భైంసా మున్సిపల్ ఆర్‌వో

భైంసా, ఆగస్టు 12 : పన్నుల వసూళ్ల ప్రక్రియను రోజువారీ నిర్దేశిత లక్ష్యాలతో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని భైంసా మున్సిపల్ రెవెన్యూ అధికారి రమేష్ పెర్కొన్నారు.సోమవారం పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో బిల్ కలెక్టర్లతో కలిసి విస్తృత పర్యటనలు నిర్వహించి పన్నుల వసూళ్లను చేపట్టారు. ఈ సందర్భంగా అర్‌వో రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో శత శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంతో ప్రణాళికబద్దంగా ముందుకు సాగుతున్నామని పెర్కొన్నారు. మున్సిపాలిటీకి పన్నుల లక్ష్యం రూ.6.77 కోట్లు ఉండగా ఇప్పటి వరకు 79.36 లక్షల పన్నులను వసూలు చేపట్టామని తెలిపారు. పట్టణ పరిధిలో 6 గురు బిల్ కలెక్టర్లు ఉండగా రోజుకు రూ.2.85 లక్షల పన్నుల వసూలును నిర్దెశిత లక్ష్యంగా విధించామన్నారు. మున్సిపల్ కమీషనర్ రాజేష్ కుమార్ ఆదేశాలకు అనుగుణంగా పన్నుల వసూళ్లను పకడ్బందీగా చేపడుతున్నామని వివరించారు.బకాయిలకు అస్కారం ఉండకూడదనే లక్ష్యంతో ఇప్పటి నుంచే పన్నుల వసూళ్ల పట్ల ప్రత్యేక దృష్టి సారించినట్లుగా తెలిపారు. పట్టణవాసులు సకాలంలో తమ తమ ఆస్తి, నీటి పన్నులను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఇందులో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ మల్కన్న, బిల్ కలెక్టర్ దేవేందర్‌లు పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు

భైంసా రూరల్, ఆగస్టు 12 : మండలంలోని మాటేగాం టోల్‌ప్లాజా వద్ద సోమవారం సీఐ నైలు ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ... వాహనదారులు జాతీయ రహదారిపై ప్రయాణం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలు నడిపి ఇంటికి చేరుకోవాలన్నారు. అదేవిధంగా వాహనాల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ వెంట ఉంచుకొని ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్ తప్పక ధరించి జాతీయ రహదారి భద్రత నియమ నిబంధనలు పాటించాలన్నారు. లేనియెడల కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ నైలు, ఏఎస్సై, పోలీస్ బృందం పాల్గొన్నారు.

బీసీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 12 : జిల్లాలోని బీసీ వర్గాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఆ శాఖ జిల్లా అధికారి డి. శ్రీనివాస్‌ను బీసీ విద్యార్థి సంఘు నాయకులు కోరారు. సోమవారం నూతనంగా జిల్లా బీసీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు తీసుకున్న ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయనను సన్మానించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి మనోజ్, నాయకులు గంగన్న, శ్యామ్ కుమార్, ఏవో కాలిక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచార్యకు ఘన నివాళులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 12 : సీపీఐ నేత పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య ఇటీవల మృతి చెందగా సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. సీపీఐ పార్టీ కార్యదర్శి సీతారాం చంద్రరావుతో పాటు వయనాడ్ మృతులకు సంతాపం తెలిపారు. నాయకులు ఎస్ఎన్ రెడ్డి, కే. శంకర్, ఎస్. విలాస్ పాల్గొని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట

● భైంసా డివిజన్ ఆరోగ్యమిత్రల వెల్లడి ● ఎమ్మెల్యే రాంరావ్‌పాటిల్‌కు వినతిపత్రం అందచేత

భైంసా, ఆగస్టు 12 : ఆరోగ్యమిత్రలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెబాట పడుతామని ఆరోగ్యమిత్రలు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం భైంసా డివిజన్ పరిధిలోని ఆరోగ్య మిత్రలు స్థానికంగా ముథోల్ ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్‌కు కలిసి సంబంధిత విషయంలో వినతిపత్రాన్ని అందచేశారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకవెళ్లి పరిష్కరింప చేసే దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యమిత్ర ప్రతినిధులు స్వప్న, దేవలత, అనసూయ, సంగీత, గోపికుమార్‌లు మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకంలో భాగంగా పనిచేస్తున్న తమకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించి జీవో నెం 60 ప్రకారం రూ.22,740 వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఇదే క్రమంలో వేతనాలను అవుట్ సోర్సింగ్ ద్వారా కాకుండా ట్రస్టు ద్వారా చెల్లించి కాంట్రాక్టు విధానంలోకి మార్చాలన్నారు. అంతేకాకుండా రాబోయే పీఆర్‌సీలో కనీస వేతనం రూ.35 వేలకు పెంచి టీఏ, డీఏ సౌకర్యం కల్పించి షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. సంబంధిత సమస్యలు పరిష్కరించని పక్షంలో యూనియన్ రాష్ట్ర శాఖ ఆదేశాలకు అనుగుణంగా సమ్మె బాట పడుతామని స్పష్టం చేశారు. ఇందుకు స్పందించిన ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఆరోగ్య మిత్రల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింప చేసేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని వెల్లడించారు.



ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఆరోగ్య మిత్రలు

మహాత్మజ్యోతి బాపూలే పాఠశాల సమస్యలు పరిష్కరిస్తా

ముథోల్, ఆగస్టు 12 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను ఎట్టి పరిస్థితుల్లో ఎక్కడికి తరలించమని, నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం మహాత్మ జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో ప్రత్యేకంగా ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. పాఠశాలలో వసతులు సరిపోవడం లేదని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే ప్రక్కన ఖాళీగా ఉన్న బిల్డింగ్ యజమానితో మాట్లాడారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌సీవో గోపిచంద్‌కు సూచించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

సీపీఎస్ రద్దు చేయించి
ఓపీఎస్‌ను అమలు చేయించడమే లక్ష్యం : పీఆర్‌టీయూ

దిలావర్‌పూర్, ఆగస్టు 12 : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయడమే సమస్యకు పరిష్కారమని పీఆర్‌టీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న అన్నారు. సోమవారం మండలంలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 2003 సంవత్సరం నుండి సీపీఎస్‌ను అమలు చేయడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర మనోవేదనతో ఉన్నారన్నారు. సీపీఎస్ రద్దు చేయించి ఓపీఎస్‌ను అమలు చేయించడమే పీఆర్‌టీయూ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 317 జీవో కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి త్వరలోనే ముగింపు పలకనున్నారని చెప్పారు. ఉపాధ్యాయ పదోన్నతుల్లో మిగులు స్కూల్ అసిస్టెంట్ ఖాళీల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులను వెనువెంటనే చేపట్టి భర్తీ చేయడం విద్యాశాఖ చరిత్రలోనే మొదటి సారన్నారు. సీపీఎస్‌ను రద్దు చేయించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఓపీఎస్ సౌకర్యం కల్పించడానికి హర్షవర్ధన్ రెడ్డి తీవ్రంగా శ్రమిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి సహకారంతో త్వరలోనే సాకారం అయ్యే అవకాశం ఉందన్నారు. కరువు భత్యం బకాయిలను త్వరలోనే సాధిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఏర్పాటు చేసిన మూడవ వేతన సవరణ సంఘంలో మెరుగైన ఫిట్మెంట్ సాధించడానికి హర్షవర్ధన్ రెడ్డి ముఖ్య మంత్రితతో చర్చలు జరుపుతున్నారని, తగిన ఆధారాలు పీఆర్‌సీ చైర్మన్ ముందు సమర్పించి మెరుగైన ఫిట్మెంట్ సాధిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి చక్రాల హరిప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు మడిపల్లి హరహరనాథ్, దిలావర్‌పూర్ మండలం నాయకులు సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రచ్చబండ

ముథోల్, ఆగస్టు 12 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణలు ఆరోపించారు. ముథోల్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన రచ్చబండ సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక హామీలు గ్యారంటీలు ఇచ్చి ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణ నిర్వహించారు. అనంతరం ముథోల్ ఎమ్మెల్యే మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, బీజేపీ నాయకులు కోరి పోతన్న తదితరులున్నారు.

ఆంధ్రజ్యోతి





ఎదురుచూపులు

- జిల్లాలో జాడలేని కొత్త రేషన్ కార్డులు
- ఏళ్లుగా అర్హులకు అందని సంక్షేమ పథకాలు
- వేలల్లో దరఖాస్తులు.. పరిశీలించని అధికారులు
- రేషన్‌కార్డులు అందక తీవ్రంగా నష్టపోతున్న పేదలు
- కార్డుల జారీ విధి విధానాలపై మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుతో దరఖాస్తుదారుల్లో చిగురిస్తున్న ఆశలు

బజార్‌హత్నూర్, ఆగస్టు 12: జిల్లాలో అర్హులైన పేదలకు నూతన రేషన్‌కార్డులు అందక తీవ్రంగా నష్ట పోతున్నారు. రేషన్‌కార్డుల కోసం ఏళ్లగా ఎదురు చూ స్తున్నారు. అయితే కొత్త రేషన్ కార్డుల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఇదివరకే ఆమోదం తెలపడంతో పాటు సబ్‌కమిటీ ఏర్పాటు చేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన శనివారం కొత్త తెల్లరేషన్ కార్డుల జారీ విధివిధానాలపై మంత్రివర్గ ఉప సం ఘం చర్చించింది. పట్టణాల్లో రూ.2లక్షల్లోపు, గ్రామాల్లో రూ.లక్షన్నర వార్షికా దాయం లేదా మాగాణి 3.50 ఎకరాలు లేదా చెల్క 7.5 ఎకరాల లోపు ఉన్నవారికే తెల్ల కార్డులివ్వాలని ప్రతిపాదించింది. అయితే కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు ఎప్పుడు తీసుకోవాలనే దానిపై ప్రభుత్వం త్వరలో ప్రకటించనుంది. దీంతో రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారిలో ఆశలు చిగురిస్తు న్నాయి.

మార్పు, చేర్పులకు అవకాశం లేదు

జిల్లాలో కొన్నేళ్లుగా రేషన్‌కార్డులో మార్పులు చేర్పులకు అవకాశం రావడం లేదు. జిల్లా వ్యా ప్తంగా ప్రతిరోజూ మండల అధికారులతో పాటు జిల్లాస్థాయిలో అధికారులను కలుస్తూ దరఖాస్తు లను అందిస్తు న్నారు. తమకు రేషన్‌కార్డులను మంజూరు చేయాలని కోరుతున్నారు. వీరితో పాటు రేషన్‌కార్డులో కొత్తవారి పేర్లు ఎంట్రీ చేయాలని దర ఖాస్తు చేస్తున్నారు. కొత్తగా పెళ్లి చేసుకున్నవారితో పాటు పుట్టిన పిల్లల పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేస్తున్నారు. ప్రభుత్వం ఎప్పుడు వెబ్‌సైట్ ఓపెన్‌చేస్తుందోనని దరఖాస్తుదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పుట్టిన పిల్లల పేర్లు కొత్తగా వచ్చిన కోడళ్ల పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు కాకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందలేకపోతున్నారు. అదేవిధంగా రేషన్ కార్డు లేని అనేకమంది ఆరోగ్య సేవలు దూరమవుతున్నారు. ఆయుష్మాన్‌కార్డుకు అర్హత సాధించడం లేదు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుని అప్పుల పాలవుతున్నారు.

జిల్లాలో 1.92 లక్షల రేషన్‌కార్డులు

జిల్లాలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, బోథ్, ఖానాపూర్ డివిజన్ పరిధిలో మొత్తం 1,92078 రేషన్‌కా ర్డులు ఉన్నాయి. ఇందులో ఆహారభద్రత కార్డులు 1,77,646 ఉండగా అంత్యోదయ కార్డులు 14,181, అన్నపూర్ణకార్డులు 251 ఉన్నాయి. 1.92లక్షల కార్డుల పరిధిలో మొత్తం 6,42,429 మంది లబ్ధిపొందుతు న్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం గత ప్రభుత్వంలో ఉన్న రేషన్‌కార్డులన్నింటినీ రద్దుచే సింది. నిబంధనల్లో పలు మార్పులుచేసి కొత్తగా రేషన్ కార్డులను జారీచేసింది. ఆ కార్డుల జారీప్రక్రి యను నిరంతరం కొనసాగించింది. అయితే 2018లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం 2019 వరకు కొత్త రేషన్‌కార్డులను జారీచేయగా ఆ తర్వాత వెబ్‌సైట్‌ను మూసివేసింది.

మార్పుచేర్పులకు 20 వేలకు పైగా దరఖాస్తులు

కుటుంబంలో తమ పిల్లలకు వివాహాలు జరిగి కోడళ్ల పేర్లను, వారికి జన్మించే పిల్లల పేర్లను కార్డులో చేర్చేందుకు కూడా ప్రభుత్వం అవకాశం ఇవ్వడం లేదు. ఇలా మార్పులు, చేర్పులకు సంబం ధించి జిల్లాలో 20 వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్‌కార్డుల్లో పేర్లు కలిగి ఉన్న వారిలో ఎవరైనా మరణిస్తే వారి పేర్లను తొల గించేందుకు మాత్రం అవకాశం కల్పించింది. రేషన్ కార్డుల్లో పేర్లు లేనివారికి ఎవైనా ఆరోగ్య సమస్య వస్తే ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత సేవలు పొందేం దుకు సంబంధిత పత్రాలు సమర్పిస్తే కలెక్టరేట్‌లో అప్పటికప్పుడే వారి పేరిట కలెక్టర్ సంతకంతో తాత్కాలికంగా ఓ కార్డును జారీ చేసేవారు. ప్రస్తుతం ఆ కార్డులు కూడా ఇవ్వడం లేదని పలు వురు బాధితులు వాపోతున్నారు.

అందని సంక్షేమ పథకాలు

రేషన్‌కార్డుల్లో పేరు లేకపోవడంతో ప్రభుత్వం మం జూరు చేసే ఇతర సంక్షేమ పథకాలకు దూరం అవు తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్‌లో పేరు నమోదుచేసుకోవాలంటే ముందుగా రేషన్‌కార్డులో పేరు నమోదై ఉండాలి. కార్డులో పేరు నమోదులేకపోవడం వల్ల చాలా మం దికి ఈ పథకం వర్తించడం లేదు. వాటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సంక్షేమ పథకాలకు రేషన్ కార్డుతో ముడిపడి ఉండడంతో లబ్ధిదారులకు ఇబ్బం దులు తప్పడం లేదు. అదేవిధంగా రేషన్‌కార్డు ఉన్న వారికి ఆరోగ్యశ్రీ ఆధారంగా ఆయా ఆసుపత్రుల యాజమా న్యాలు ఉచిత సేవలను అందించేవారు. ఆరోగ్యశ్రీ కార్డు లేకున్నా రేషన్‌కార్డు చూపిన కూడా రిఫరల్ ఆసుపత్రిలో వైద్యసేవలు అందించేవిధంగా ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అవకాశం కల్పించింది. కాగా, రేషన్‌కార్డులో పేర్లు లేని వారు ఆరోగ్యశ్రీ ఉచిత సేవలను పొంద లేని పరిస్థితి ఏర్పడింది. కొత్తకార్డుల జారీ ప్రక్రి యను కార్డుల్లో మార్పులు, చేర్పులను చేపట్టేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చినట్లయితే పేద, మధ్య త రగతి వారికి కాస్త ఊరట కలగనుంది.

ఐదేళ్లుగా ఎదురు చూస్తున్నా..

: జడల శ్రీనివాస్, బజార్‌హత్నూర్

ఐదేళ్లగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూ స్తున్నా. ప్రస్తుతానికి నాకు ఒక పాప. పిల్లల పేర్లు, నా భార్య పేరును కూడా మాకున్న పాత రేషన్ కార్డులో చేర్పించలేక పోతున్నాం. ప్రజాపాలనలో రేషన్ కార్డులకోసం దరఖాస్తు చేసుకున్నాం. వెంటనే ప్రభుత్వం రేషన్ కార్డుల ను జారీ చేయాలి.

వెంటనే కొత్త కార్డులను అందించాలి..

: శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు

ఎందరో పేదలు కొత్త కార్డులకోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రేషన్ కార్డుల్లో పేర్లు లేకపోవడంతో ప్రభుత్వం అందించే సంక్షే మ పథకాలకు దూరమవుతున్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డుల కోసం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి, అర్హులందరికీ నూతన రేషన్ కార్డులను జారీచేయాలి.

ఆదేశాలు రాగానే దరఖాస్తులు స్వీకరిస్తాం..

: కిరణ్‌కుమార్, డీఎస్‌వో, ఆదిలాబాద్

ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాక పోవడంతోనే కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు లు స్వీకరించడంలేదు. ప్రభుత్వం నుంచి ఆదే శాలు వచ్చిన వెంటనే వెబ్‌సైట్‌ను అందు బాటులోకి తీసుకువచ్చి అర్హులైన వారికి కార్డుల ను జారీచేస్తాం.

వైద్యుల నియామకానికి మంత్రి సీతక్క హామీ



మంత్రికి సమస్యలు వివరిస్తున్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నాయకులు

ఉట్నూర్, ఆగస్టు 12 : ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల నియామకానికి రాష్ట్ర మంత్రి సీతక్క హామీ ఇచ్చారని జిల్లా కాంగ్రెస్ నాయకురాలు సుగుణక్క తెలిపారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్ని కల్లో భాగంగా వర్ధా నియోజక వర్గంలో ప్రచారం చేయడానికి ములుగు నుంచి బయలుదేరిన మంత్రి సీతక్క ఉట్నూర్ మండల కేంద్రంలోని రాంజీ గోండుచౌక్ వద్ద ఆదివారం రాత్రి ఆగారని, మర్యాద పూర్వకంగా కలిసి ఉమ్మడి జిల్లాలోని పలు సమస్యలను వివరించామన్నారు. ఉట్నూర్, జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రులలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించి పేదప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని విన్నవిస్తూ మెమోరాండం అందిం చగా మంత్రి స్పందించారన్నారు. జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు సంవత్సరాల నుంచి ఒకరే వైద్యుడు ఉండడం వల్ల ఐదు మండలాల ప్రజలకు పూర్తిస్థాయి లో వైద్యం అందడం లేదని, వైద్య పరికరాలు ఉన్న ఆప రేటర్స్ లేక ఇక్కడి ప్రజలు చిన్న వైద్యానికి కూడా ఆదిలా బాద్ రిమ్స్ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుందని వివరించామ న్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క ఉ ట్నూర్, జైనూర్ ఆసుపత్రుల్లో వెంటనే వైద్యులను నియ మిస్తామని తెలిపినట్లు సుగుణక్క పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు ఇవ్వండి

బోథ్ : నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని కోరుతూ సోమవారం బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ చైర్మన్ జి.రాజు యాదవ్, జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్కకు విన్నవిం చారు. ఆదిలాబాద్‌కు వచ్చిన ఆమెను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి నిధుల విషయమై అడగడం జరిగిందని వివరించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

సేవగ్రామ్‌ను సందర్శించిన మంత్రి

ఆదిలాబాద్ అర్బన్ : మహారాష్ట్రలోని సేవగ్రామ్‌ను జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సందర్శించారు. స్వాతంత్ర్యానికి పూర్వం 1936లో మహాత్మాగాంధీ స్థాపించిన ఆశ్రమాన్ని సందర్శించి ఆశ్రమమంతా కలియ తిరిగారు. అనంతరం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా జాబితాను సిద్ధం చేయండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 12 : గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా తయారు చేసేం దుకు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్య క్రమాన్ని జిల్లా పరిషత్ సమావేశ మందిరం లో నిర్వహించారు. ఇందులో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వ హించిన శిక్షణ శిబిరానికి జిల్లా కలెక్టర్ రాజా ర్షిషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సం దర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి ఎటువంటి తప్పులు లేని వార్డుల వారీగా గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాను తయారు చేసేందుకు శిక్షణను నిర్వహించడం జరిగిం దన్నారు. అదే విధంగా రాబోయే రోజులలో నిరంతర ప్రక్రియగా స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లి శానిటేషన్, ప్లాంటేషన్ కార్యక్రమాలు యథావిధిగా జరిగే విధంగా చూడాలని పంచాయతీ కార్యద ర్శులను ఆదేశించారు. ఇందులో జిల్లా పంచా యతీ అధికారి శ్రీలత, డివిజనల్ పంచాయతీ అధికారి ఫణీంద్ర, ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఎంపీఓలు పాల్గొన్నారు.

హాస్టళ్లలో వసతులు కల్పించాలని ధర్నా



ఉట్నూర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఉట్నూర్, ఆగస్టు 12 : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యా ర్థి సంఘం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో వసతి గృహా లలో మౌలిక వసతులు కల్పించాలంటూ సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. జిల్లా అధ్యక్షు లు ప్రభంజనం ఆధ్వర్యంలో జరిగిన విద్యార్థుల నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్లో మౌలికవసతులు కల్పిం చాలని డిమాం డ్ చేశారు. అనేక హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు లేకుండా నడుస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని, ఉన్నతాధి కారుల దృష్టికి అనేక సందర్భాలలో విద్యార్థులు తమ సమస్యలను తీసుకెళ్లినప్పటికీ సమస్యలు పరిష్క రించ కుండా కాలయాపన చేస్తున్నారన్నారు. కొన్ని హాస్టళ్లలో ఇన్‌చార్జీ వార్డెన్లతో, వర్కర్లు, వాచ్‌మెన్స్, స్కావెంజర్స్ లేకుండా కొనసాగుతున్నాయన్నారు. ఇలాంటి హాస్టళ్లలో విద్యార్థులే అన్ని పనులు చేసుకుంటున్నారన్నారు. ఇప్ప టికైనా జిల్లా యంత్రాంగం అన్ని హాస్టళ్లను సందర్శించి విద్యార్థులు, విద్యార్థినిలు ఎదుర్కొం టున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీడీఎస్‌యూ డిమాండ్ చేస్తుందని తెలిపారు. ప్రభుత్వాలు సంక్షే మ హాస్టళ్లకు నిధులు కేటాయిస్తున్నామని ఒక పక్క చెబుతున్నప్పటికీ కనీస సౌకర్యాలకు కూడా నోచుకోలేని స్థితిలో జిల్లా వ్యాప్తంగా హాస్టల్స్ నడుస్తున్నాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాల ని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వర్షాకాలం సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని హెల్త్ క్యాంపులు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపా డాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అం దిం చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పెద్దఎత్తున విద్యార్థి ఉద్యమాలు చేపడతా మని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. కార్యక్రమం లో అనిల్, నరేష్, మహేశ్, జంగు పాల్గొన్నారు.

నా ఉద్యోగం ఇప్పించండి

- ఉద్యోగం ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటా..
- కోర్టు ఆదేశించినా స్పందించరా?
- ఐటీడీఏ ఉద్యోగి ఆవేదన



ఉద్యోగి గుమ్ములరమేష్

ఉట్నూర్, ఆగస్టు 12 : కరోనా సోకడంతో విధులకు గైర్హాజరైన ఐటీడీఏ దినసరి ఉద్యోగి గుమ్ములరమేష్ తనకు ఉద్యోగం ఇస్తారా ఆత్మ హత్య చేసుకోమంటారా అంటూ ఐటీడీఏకు వచ్చాడు. సోమవారం ఐటీడీఏ అధికారులు తనకు ఉద్యోగం ఇవ్వడం లేదని తాను పెట్రో ల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానంటూ ఐటీడీఏకు వస్తున్నట్లు మీడియాకు సమా చారం అందించాడు. ఐటీడీఏకు వచ్చిన రమే ష్ మాట్లాడుతూ 2020లో కరోనా సోకడంతో నెలరోజుల తర్వాత విధులకు రాగా తనను ఐటీడీఏ అధికారులు విధుల్లోకి తీసుకోలేదని వాపోయాడు. దీంతో హైకోర్టును ఆశ్రయించా నని తెలిపారు. హైకోర్టు దినసరి ఉద్యోగిగా ఉన్న తనను రెగ్యూలర్ చేస్తూ విధుల్లోకి తీసు కోవాలని ఆదేశించినప్పటికీ ఐటీడీఏ అధికారు లు స్పందించడం లేదని తెలిపారు. ప్రతి సోమవారం ఐటీడీఏలో జరిగే గిరిజన దర్బా ర్‌కు హాజరవుతూ దరఖాస్తులు చేసుకుం టున్నా లాభం లేకపోవడంతో మరోసారి కోర్టు ను ఆశ్రయించానని తెలిపారు. తనకు ఉద్యో గం ఇవ్వకపోతే చనిపోతానని తన ఆత్మహ త్యకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉం టుందన్నారు. ఐటీడీఏ వద్ద విధుల్లో ఉన్న పోలీసులు అతడిని నివారించి ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా దగ్గరకు తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పరిపాలనాధికారి సెలవుల్లో ఉండడం వల్ల నీ పని ఆలస్యం అవుతుందని, ఈ నెల 16 వర కు ఆయన విధుల్లోకి వస్తాడని, ఆ తర్వాత న్యాయం చేస్తామన్నారు.

'ఐటీడీఏ ఉపాధ్యాయుల బదిలీలు ఆఫ్‌లైన్‌లో చేయండి'

ఉట్నూర్, ఆగస్టు 12 : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమపాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యా యుల బదిలీలు ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్ లో చేపట్టాలని టీఎస్‌టీటీఎఫ్ ఉపాధ్యక్షులు కపి ల్‌కుమార్‌జాదవ్ గిరిజన సంక్షేమ శాఖ డీడీ సర్వేశ్వర్‌రెడ్డిని కోరారు. సోమవారం హైదరా బాద్‌లోని డీఎస్ఎస్‌భవన్‌లో డీడీ సర్వేశ్వర్ రెడ్డిని కలిసి ఈ మేరకు ఆన్‌లైన్‌లో చే పట్టడం వల్ల ఎదురవుతున్న సమస్యలు వివరిం చామ న్నారు. సీనియర్ కాదని జూనియర్ ఉపాధ్యా యులకు కోరుకున్న చోట ఇవ్వడం సరికాదని తెలుపామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి రాంబాబు

రోగులకు ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దు

- ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందికి డాక్టర్ రాంబాబు సూచన
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

నార్నూర్, ఆగస్టు 12 : ఏజెన్సీ గిరిజన ప్రాంత ఆసుపత్రుల విషయమై 'ఆంధ్రజ్యోతి'లో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రక్షణ కరువు అనే కథ నంపై అధికారులు స్పందించారు. నార్నూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్యుడు రాంబాబు ఆసుపత్రిలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది పనితీరుపై మండిపడ్డారు. ఇక ముందు ఇక్కడ ఆసుపత్రి వద్ద ఏ చిన్న విషయం తప్పుగా కనిపించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక ముందు మీపై ఫిర్యాదులు వస్తే సహించం అని హెచ్చరించారు. సమావేశంలో తులసిచరణ్, జవహార్ తదితరులున్నారు.

సిడాంశంభు విగ్రహం ఏర్పాటు చేయండి

- గిరిజన దర్బార్‌లో ఆదివాసీ నాయకులు



వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

ఉట్నూర్, ఆగస్టు 12 : ఉమ్మడి రాష్ట్రంలోని పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు హక్కుపత్రాలు కావాలంటూ ఉద్యమాలు చేసిన పోరాట వీరుడు సిడంశంబు విగ్రహాన్ని ఐటీడీఏ ద్వారా ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తాను కోరా రు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాంగణంలో ఉన్న పీవో క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో మాజీ ఎంపీపీ పంద్రజయవంతరావు, జిల్లా మేడి మేస్రం దుర్గు, తుడం దెబ్బ జిల్లా అధ్యక్షుడు పురకబాపురావు, ఆడ హన్మంతురావు, ఆత్రం తిరుపతి, కుంరవినాయక్, సిడాం సోనేరావులు కలిసి శంబు పోరాటాల గురించి పీవోకు వివరించారు. తుడందెబ్బను స్థాపించి జిల్లా గిరిజనుల సమస్యలపై ఉద్యమం చేసిన నాయకుడని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రం లోని గిరిజనుల పోడుభూముల సమస్యను గ్రామం నుంచి ఢిల్లీ వరకు తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గిరిజనులకు పోడుభూములకు హక్కులు కల్పించడం జరిగిందని వివరించి ఆయన మృతిచెందినందున ఆయన స్వగ్రామమైన మత్తడిగూడలో విగ్రహం ఏర్పాటుకు ఐటీడీఏ సహకరించాలని కోరారు. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తారని పీవో హామీ ఇచ్చినట్లు వారు తెలి పారు. ఇది ఇలా ఉండగా ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు చాలా మది పాఠశాలల్లో ప్రవేశం కోసం, తాత్కాలిక ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధి కారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జైనథ్ రూరల్ సీఐ సాయినాథ్

జైనథ్, ఆగస్టు 12 : జైనథ్, బేల, బీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలు సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని జైనథ్ రూరల్ సీఐ సాయినాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. వాట్సప్‌లో వచ్చే అనవసరమైన లింకులను ఓపెన్ చేయ వద్దని, ఇండిపెండెన్స్‌డే సందర్భంగా ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా రివా ర్డుక్యాష్‌బ్యాక్ వచ్చాయంటూ లింక్స్ పంపిస్తే వాటిని ఓపెన్ చేయవ ద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.